# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

ఇద్దరూ యెన్నదగిన మిత్రులు—

ఎన్నో పోలికలున్నవారు. అందంలో ఒకరిని మించిన వారొకరు. కొంటె తనంలో నువ్వా, నేనా అనేవారు— పిఠాపురంలో ఒక సాహిత్య సభలో తటస్థ పడ్డారు.

ఒకరు మునిమాణిక్యం నరసింహారావు గారు. రెండోవారు వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు. మునిమాణిక్యం గురించి శివశంకరశాస్త్రిగారు అనేవారట- 'మా నరసింహారావు చేతులు కడిగి సిరాషాపు పెట్టుకోవచ్చు' అని.

ఇంకో ముచ్చట — వేదుల, మునిమాణిక్యం రాజమండ్రిలో ఒక గదిలో వుండే వారట. ఆ యింటి యజమానిని యేడిపించాలని ఒక పథకం ఆలోచించారు.

తెల్లవారేసరికి యిద్దరూ తీరుబడిగా కూర్చుని మాటల్లో వివాదం ప్రారంభించి కేకల్లోకి పాకి కొట్టుకోవడంలోకి దిగారు.

ఇంటాయన హడలిపోయి పరుగెత్తుకుంటూ వచ్చి 'బాబ్బాబూ అన్నదమ్ముల్లా ఉండేవారు. ఎందుకీ దెబ్బలాట చెప్పండి?' అంటే 'బాబూ మీరే చెప్పండి- ఇతడికంటె నే నందమైన వాణ్ణి అవునా, కాదా? అట్లాంటప్పుడు తానే అందగాడినని తెగ గింజుకుంటున్నాడు.' అని వేదుల అంటే, మునిమాణిక్యం 'బాబుగారికి కళ్ళు లేవా? ఆయనన్నే చెప్పకును' అని లేచాడు.

బాబుగారికి కళ్ళుంటే మునిమాణిక్యం అందమైనవాడవడం ఖాయం లేకపోతే వేదుల-

బాబుగారు తెల్లబోయి తేరుకుని కళ్ళు మూసుకుని "ఇద్దరూ నవమన్మథులురా నాయనా? ఇక కొట్లాడకండి" అని విడదీసి వెళ్ళిపోయాడట!

మునిమాణిక్యం ఆ సభలో 'తెలుగులో హాస్యం' అనే విషయం మీద మాట్లాడాలి.

కవిత్వంలో నేను ఉద్దండుణ్ణి అని వేదులకు వుంటే కథల్లో నేను వాడి తాతను అని మునిమాణిక్యం నమ్మకం.

అహం లేకపోతే మనిషే కాడు. అది ముదిరితేనే బాధ- "తెలుగులో మంచి హాస్యం పూర్వం లేదు. పూర్వం వున్నదల్లా తోలుబొమ్మలాటల్లో. భాగోతాలో ఉన్న అసభ్య హాస్యమే. మన పూర్వ కవులు హాస్యం మరిచిపోయి హాస్యాన్ని అపహాస్యం పాలు చేశారు. ఆరోగ్యవంతమైన సభ్యమైన హాస్యం నవ్య సాహిత్యం తోటే పుట్టింది" అని ప్రతిపాదిస్తూ సోదాహరణంగా ప్రసంగం సాగించారు.

వేదుల అధ్యక్షుడు చట్టునలేచి "హాస్యం మన పూర్వకవులు ఎరగని దినుసు కాదు

## నవ్వులు : నొవ్వులు

'విజయ విలాసం' వంటి పూర్వ ప్రబంధాల్లో కావలసినంత హాస్యం ఉంది చూస్తే" అని రిమార్కు చేసి కూచున్నారు.

చెకుముకిలో నిప్పురవ్వ లేచింది.

మునిమాణిక్యం లేచి "ఈ శాస్త్రిగారు ఉభయ భాషలు చదివినవారు- ఈయన్ని చెప్పమనండి చూద్దాం" అని 'అనిమొన' నా మీదకి తిప్పారు. 'కొసరి ఆబోతు నాబోతు క్రుమ్ములాడ. నడుమ నాబెయ్య గతి వచ్చె నాకు' అన్నట్టు నా పని ఇరుకున పడింది. పిఠాపురానికి తుని దగ్గర. తుని తగువు చేయడం మంచిది, అని లేచాను. పెద్దలిద్దరూ నన్ను పరీక్షకు పెట్టారు. ఏవో రెండు మాటలు చెప్పక తప్పదు.

"పూర్వ సంస్కృతాంధ్ర సాహిత్యాలలో నే నెరిగినంత వరకు- హాస్యం అంగిరసంగా (ప్రధానరసం) లేకపోవడం నిజం ఆంగ్ల సాహిత్య సంపర్కం వల్లనే హాస్యానికి ఒక ప్రత్యేక పీఠం ఎర్పడింది. దాని ప్రభావంవల్లనే విశ్వనాథ కవిరాజు భమిడిపాటి, పానుగంటి, గురజాడ, మొక్కపాటి వగైరాలు హాస్యాన్ని అగ్ర పీఠం ఎక్కించారు.

కాని, పూర్వం సంస్కృతాంధ్రాల్లో హాస్యం లేదనికాని- ఉంటే అది సభ్యంగా లేదనిగాని అనడం సబబుకాదు. 'విజయ విలాసం'లో "ప్రాకాగియున్నది మిగుల నంగంబు జూడ వీయపురాలి వైతిగదవే' వంటిపద్యాల్లో ఉన్నదిసరసోక్తికానిహాస్యం కాదు. హాస్యానికి వికృత వాక్య సంఘటన చేష్టాదు లుండాలి. అయితే— 'విజయ విలాసం' కాకపోయినా తిక్కనగారి ఉత్తరకుమార చిత్రణం, నన్నయగారి బకాసుర ఘట్టం, పాండురంగ మాహాత్మ్యంలోని అయుత నియుతుల కథ తెలుగువారి హాస్య ప్రీతికి నిదర్శనాలు.

ఇక సంస్కృతంలో వాల్మీకి మంచి హాస్యప్రియుడు. శూర్పణఖ కథలో వానరుల మధువన విహారంలో కుంభకర్ణ నిద్రాఘట్టంలో చిత్రించిన హాస్యం సభ్యమైనదీ, సరసమైనదీని.

సాధారణంగా సంస్కృత నాటకాల్లో వున్న విదూషకుల హాస్యం తిండిపోతుతనం, అసహజవాక్య ప్రలాపం వంటి వాటివల్ల పుట్టింది కనక అది మనస్సును రంజించేది కాదని- ఆధునికుల చాలా మంది అభిప్రాయం. కాని అది చాలా వరకు అపోహ మాత్రమే. చదవక ఎవరో చెబితే ఏర్పరచుకొన్న అభిప్రాయం! కొన్ని వాక్యాలు తిండిపోతుతనం, తెచ్చి పెట్టుకుని నవ్వించేవిగా వున్నా- మాళవికాగ్నిమిత్రంలో విదూషకుని గడుసైన హాస్యం వుంది. అసలు విదూషకుడే విజృంభించి నాటకమంతా నడుపుతాడు. 'మృచ్ఛకటికం'లో శకారుని అసందర్భ ప్రలాపాలకు హాస్యపు విలువ ఇవ్వకపోయినా- మైత్రేయుని మాటలో, కర్ణాట కలహంలో మంచి హాస్యం దొరుకుతుంది.

సంస్కృతంలో కేవలం హాస్యరస ప్రధానంగా రాసిన ప్రహసనాలు లేకపోలేదు. కాని అవి చాలావరకు అసభ్య హాస్యంతో ఉన్నవి గనక తీసివేద్దాం.

ఇంకొక్క మాట చెబుతాను - మన్నించండి. వేదులవారు విదేశీ హాస్య రచనలు చదివితే- మునిమాణిక్యం తిక్కనగారి ఉత్తరుణ్ణి, వాల్మీకి మధువనాన్ని చూస్తే- 'వడ్లగింజలో బియ్యపుగింజ' అసలీ చర్చే లేదు" అని నవ్వుతూ కూర్చున్నాను. వాతావరణంలోని వేడి తగ్గి పన్నీరు చినుకులు చిందినట్టు- సభ కలకల నవ్వింది.